

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,30 సెప్టెంబర్ 2025

8 పేజీలు





# రూకలిస్తేనే..రిజిస్ట్రేషన్ !



## షాడో దే రాజ్యం



పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- ఆ సబ్ రిజిస్ట్రార్ స్టైలె వేరయా...!
- టార్గెట్ పేరుతో లంచాల బరితెగింపు
- ఆ సబ్ రిజిస్ట్రార్.. డాక్యుమెంట్ రైటర్ల ధనదాహంపై ప్రజల ఆగ్రహం
- ఇక్కడ రైటర్లు, షాడో బాబు కీలకం
- షాడో బాబుకు డబ్బులు ముట్టజెపితేనే రిజిస్ట్రేషన్
- డాక్యుమెంట్ వాల్యూకి 1.0శాతం అదనంగా దోపిడీ
- కొన్ని డాక్యుమెంట్లకు లక్షల్లో లంచాలు డిమాండ్
- షాడో బాబుకి లంచం ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్ జరగడం కలే
- ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు మోకాలడ్డు
- ఏసీబీ దాడులు జరుగుతున్నా...ఇక్కడ ఆగని దళారుల దందా
- ఇప్పటికైనా న్యాయబద్ధంగా ఆరిజిస్టర్ మారని ప్రజలు వేడుకోలు..

పిఠాపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి వస్తుంది లంచాలు ముట్టజెప్పాల్సిందే..డాక్యుమెంట్‌ని బట్టి రిజిస్ట్రేషన్‌కి లంచాల సొమ్ములు షాడో బాబు చెబుతాడు... అది ఎంత్కెనా ముట్టజెప్పితేనే రిజిస్ట్రేషన్..ఇది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పరిస్థితి. అవినీతిలో లంచాలు మరిగిన పిఠాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, బ్రోకర్లు, రైటర్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా చెప్పాలంటే దళారులు లేనిదే ఫైల్ ముందుకు కదల దంతే. పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలపై మరింత పట్టుసాదిస్తూ... రెచ్చిపోయి షాడో బాబు చెలరేగుతున్నాడు. ప్రతీ పనికి ఒక రేటు ఫిక్స్ చేసుకుని మరీ వసూళ్ళు చేస్తున్నాడు. ఇళ్ళ స్థలాల్కెతే గజాల లెక్కన రేటు కట్టి మరీ డబ్బులు దండుకుంటున్నాడు. షాడో అడిగినంత మేర ఇవ్వకపోతే రకరకాల కొర్రీలు వేసి రిజిస్ట్రేషన్ సైతం ఆ సబ్ రిజిస్టర్ ఆపుతున్నారు.ఆశాఖలో పారదర్శకత తీసుకొచ్చానని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్పితే పైసలిస్తేనే ఫైల్ ముందుకు కదులుతోంది. దీంతో సామాన్య ప్రజలు, కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ అంటేనే భయపడిపోతున్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారిణికి ఫిర్యాదు చేద్దామంటే వారి పేర్లు చెప్పి మరీ ఇక్కడ వసూళ్ళు జరుగుతుండటం గమనార్హం... పిఠాపురం రిజిస్ట్రార్ కార్యాలయ ఆ సబ్ రిజిస్ట్రార్ అవినీతి,షాడో బాబు బరితెగింపుపై ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..


- మిగతా 2 లో..


ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో





లంచాల సొమ్ము వసూళ్లలో బిజీగా షాడో అధికారి

## ప్రభుత్వ ఆసుపత్రిలో

## మెరుగైన సేవలకోసం కృషి



- గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తున్నాం
- 20శాతం ఉన్న సిబ్బందిని పెంచాం .. అయినా లోటు ఉంది
- అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటాం
- రక్తం శాంపిల్స్ రెండుసార్లు ఇవ్వడంపై వివరణ కోరాం
- ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ అనంతరం మీడియాతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూవేస్తున్నామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.


- తరువాయి 2లో..


## అవినీతిని ఉపేక్షించేది లేదు

- జగనన్న లే అవుట్‌ల అక్రమాలపై నిగ్గు తేల్చి, క్రిమినల్ కేసులు పెడతా
- ప్రజలకు జవాబుదారీతనంగా ఉందాం
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం
- సుపరిపాలనే మా కూటమి ప్రభుత్వ ధ్యేయం
- సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తాం
- జీఎస్టీ తగ్గింపుతో ప్రజలపై భారం తగ్గుతుంది
- మన వస్తువులు మనమే కొందాం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి సుభాష్ ఆగ్రహం

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గం వెల్ల గ్రామంలోని జగనన్న లేఔట్‌లపై వస్తున్న ఫిర్యాదులపై, జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, దోషులపై క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పురపాలక సంఘం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా 3వవార్డ్ జనసేన కౌన్సిలర్ అంకంశ్రీనివాస్ జగనన్న లేఔట్ లో జరిగిన అవినీతి అక్రమాలపై సభలో మంత్రికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ


- తరువాయి 2లో..







## పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి



### - జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా,జిల్లా రెవెన్యూఅధికారి జె.వెంకట రావు,ట్రైనీ కలెక్టర్ మానీషా, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, సీపీవో పీ.త్రినాథ్,డీపీవో రవి కుమార్, జీజీహెచ్ ఎస్డీసీ ఎన్.శ్రీధర్‌లతో కలిసి హాజరై కాకినాడ నలుమూలల నుంచి వచ్చిన


- తరువాయి 2లో..

# నిడదవోలు బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుదాం

**– రూ.9.5 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి సాధించాం**

**నిడదవోలు, మేజర్ న్యూస్ :** 15 నెలల కాలంలో నిడదవోలు పట్టణంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం నిడదవోలు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘ సాధారణ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని నిడదవోలు పట్టణ అభివృద్ధికి తీసుకున్న, తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజావసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ సభ్యులు, అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. **రుడా, మున్సిపల్ శాఖ నిధులతో నిడదవోలు పట్టణంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు:మంత్రి దుర్గేష్**



రుడా,రాష్ట్ర మున్సిపల్ శాఖ నుండి ఇతోధికంగా నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి దుర్గేష్ అన్నారు.రూ.7.74 కోట్ల అంచనా వ్యయంతో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాదు తమ ప్రత్యేక కృషితో నిడదవోలులో షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ తదితర అభివృద్ధి పనులకు రుడా నిధులు సమీకరించామన్నారు.వాస్తవానికి ఒక కోటి రూపాయల నిధులు మాత్రమే మున్సిపాలిటీలకు కేటాయిస్తుండగా నిడదవోలు మున్సిపాలిటీ కోసం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో ప్రత్యేకంగా మాట్లాడి రూ.3 కోట్ల నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నానన్నారు.

**–అమృత్ పథకం ద్వారా నిడదవోలుకు మంచినీరు:మంత్రి దుర్గేష్**

నిడదవోలు పట్టణంలో అమృత్ పథకం, గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మంత్రి దుర్గేష్ విమర్శించారు. సరిగ్గా ఆ కార్యక్రమాలు చేపట్టక పోవడం వల్ల నిడదవోలు పట్టణానికి అందాల్సిన గోదావరి జలాలు అందలేకపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఏషియన్ బ్యాంక్‌తో సీఎం చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చర్చించి సంబంధిత నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నారన్నారు. తాము రాసిన లేఖలకు ఏషియన్ బ్యాంక్ స్పందించి సహకారం అందిస్తామన్నారు. ఈ క్రమంలో నిడదవోలు పట్టణానికి గోదావరి వాటర్ ప్రాజెక్ట్ అమృత్ క్రింద నీళ్ల రప్పించేందుకు ఆమోదం లభించిందన్నారు. గతంలో సోర్స్ సరిగా లేకపోవడం వల్ల ఎక్కడి నుండి నీరు తీసుకుంటున్నామో స్పష్టత కొరవడిందన్నవారు.తద్వారా ప్రాజెక్టు పట్టాలెక్కలేదని, ఈ క్రమంలో కేవలం పైప్ లైన్లతో సరిపెట్టడం వల్ల నీళ్లు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సోర్స్ ను ఏర్పాటు చేసి విజ్జేశ్వరం దగ్గర గేట్ల ఏర్పాటు ద్వారా గ్రిడ్ నుండి నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలకోసం కృషి

మొదటిపేజి తరువాయి

అనంతరం ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడుతూ గతంలో 20శాతం సిబ్బంది ఉండేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక వైద్యులను, సిబ్బందిని పెంచుకుంటూ రావడం వలన ఇంకా 40శాతం లోటు ఉందని తెలిపారు. కొన్ని స్పెషలిస్ట్ పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఇక్కడ జాయిన్ కావడం లేదని ఆయన తెలిపారు. ఇవన్నీ పరిశీలించి పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వాసు చెప్పారు. రక్తం శాంపిల్స్ ఒకటికి రెండు సార్లుతీసుకుంటున్నారని పిర్యాదులు రావడంతో అకస్మాత్తుగావచ్చి తనిఖీ చేసి,వివరణ కోరామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. థైరాయిడ్ తదితర కారణాల వలన ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. థైరాయిడ్ టెస్టింగ్ మిషన్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చెన్నె నుంచి టెక్నీషియన్స్ కూడా వచ్చారని, సరిచేయడానికి నాలుగైదు రోజుల సమయం పడుతుందని ఆయన తెలిపారు. అందుకే ఫ్రెష్ గా శాంపిల్స్ తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకునైనా సరే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేశారు. మొదటినుంచీ ఇక్కడికి రావడం, సమస్యలు తెలుసుకోవడం, అవగాహన చేసుకుని పరిష్కరించడంతో చిన్నపాటి సమస్య ఉన్నా ప్రజలు నేరుగా తమ దృష్టికి తెస్తున్నారని ఆయన తెలిపారు. ఇది మంచి సంప్రదాయమన్నారు.

సక్రమమైన పద్దతిలో సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు.ప్రజలు నేరుగా తమకు చెప్పడం వలన తమకు వాస్తవ పరిస్థితులు తెల్సి పరిష్కరించడానికి వీలవుతుందని ఆయన అన్నారు. రోజా 1600నుంచి 1800ఒపి రావడం, యాక్సిడెంట్ కేసులు రావడం జరుగుతోందని, ఇంతపెద్ద వ్యవస్థలో లోపాలు సహజమని ఆయన అన్నారు. అయితే చిన్నపాటి లోపాలు తరచూ జరిగితే నేరుగా తెలియజేయాలని ప్రజలకు ఎమ్మెల్యే వాసు సూచించారు. సిటీ స్కానింగ్ విషయమై అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే వాసు స్పందిస్తూ, రేడియాలజిస్ట్ వచ్చారని తెలిపారు. జిఎస్ఎల్ కాలేజీ వాళ్ళు , ఐ ఎం ఎ నుంచి కూడా కొంతమంది పిజి స్టూడెంట్స్ ని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండేళు పనిచేసే విధంగా సపోర్ట్ చేస్తామని చెప్పారని ఎమ్మెల్యే వాసు తెలిపారు.

## రూకలిస్తేనే ...రిజిస్ట్రేషన్ !

# పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం షాడోల రాజ్యం

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో** కాకినాడ జిల్లాలో ఉన్న పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్షన్ల పరంపర మాత్రమే కొనసాగుతుంది. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పరిపాలన అందించాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది షాడో బాబును అనధికారికంగా ఏర్పాటు చేసుకొని వాడిని కలెక్షన్ ఏజెంట్‌గా మార్చి సొమ్ములు వసూళ్ళు చేస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. బ్రోకర్లు, రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా ఒక్కటిగా మారి రిజిస్ట్రేషన్ కోసం వచ్చే కక్షిదారులను పీల్చి పిప్పి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

### పైసలిస్తే ఎటువంటి రిజిస్ట్రేషన్ అయినా ఓకే...!

రూకలిస్తే చాలుఎటువంటి రిజిస్ట్రేషన్ అయినా ఈజీగా జరిగిపోతుందని, రైటర్లు, బ్రోకర్లు, షాడోబాబు అందరూ జతకట్టి ప్రజలను దోచేస్తున్నారని చెబుతున్నారు. పూర్వార్జిత రిజిస్ట్రేషన్‌లకైతే ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండానే చేసేస్తున్నారని, అటువంటివాటికి అక్రమాలకు లక్షల్లో లంచంగా వసూలు చేస్తున్నారట. డాక్యుమెంట్ రైటర్లతో జతకట్టిన ఆ రిజిస్టర్ కాసుల కోసం ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుపుతున్నప్పటికీ జిల్లాస్థాయి రిజిస్ట్రార్ అదికారిణి, విజిలెన్స్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తమ బాధలు ఎప్పటికి తీరుతాయో, ఈ కార్యాలయం లో అవినీతి జరగకుండా రిజిస్ట్రేషన్లు ఎప్పుడు జరుగుతాయో?అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

### సూర్య కార్యాలయానికి పిఠాపురం రిజిస్ట్రార్ అవినీతి గుట్టు...!

పిఠాపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం జరుగుతున్న అవినీతి, లంచాల బాగోతంపై సూర్య కార్యాలయానికి ఫోన్లు చేస్తూ, ప్రజల బాధలు మొరపెట్టుకుంటున్నారు. తమ వద్ద రిజిస్ట్రేషన్‌ల కోసం వేలాది, లక్షలాది రూపాయలు కొందరు డాక్యుమెంట్ రైటర్లు ముక్కు పిండి మరీ వసూళ్ళు చేస్తున్నారని ఆవేదనతో చెబుతున్నారు.

నగదు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని , ఈ విధానం మారేలా అధికారులు చర్యలు చేపట్టాలా చూడాలని ప్రజలు మొరపెట్టు కుంటున్నారు.దీనిపై ఇప్పటికే ఏసీబీ టోల్ ఫ్రీనెంబర్‌కి ఫిర్యాదులు చేసినట్లు ప్రజలు చెబుతున్నారు. అసలు షాడో బాబుకి విచ్చలవిడిగా కార్యాలయంలో తిరగడానికి అక్కడ ఉన్న పని ఏంటని ప్రజలు అడుగుతున్నారు. రైటర్లు చేస్తున్న రుబాబు అక్కడ అంతా ఇంతా కాదని, తమని రక్షించి నిజాయితీగా రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని చెబుతున్నారు. ప్రజలు ఫిర్యాదుతో సూర్య బృందం వాస్తవాలను పరిశీలన చేయగా అక్కడ అంతా లంచాల మయమే..

నేరుగా షాడోబాబు నిస్సిగ్గుగా వసూళ్ళు చేయడం పక్కాగా ఆ సబ్ రిజిస్ట్రార్ అవినీతికి పరాకాష్టగా చెప్పవచ్చు.ఈకార్యాలయ అవినీతిపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్,జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# అవినీతిని ఉపేక్షించేది లేదు

మొదటిపేజి తరువాయి

హయాంలో 509మందిలబ్దిదారులకు స్థలాలు కేటాయించారని, కేటాయింపుల్లో, రుణాల మంజూరులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందనిఆరోపించారు.దీనికి సంబం ధించి గృహనిర్మాణశాఖ డిఈ సుంకర రాంబాబు గృహ నిర్మాణంపై సభకు వివరించే ప్రయత్నం చేశారు.ఈసందర్భంగామంత్రిసుభాష్ మాట్లాడుతూ ఏఒక్క లబ్దిదారులకి అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకోబోనని,అవినీతి జరిగితే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. త్వరలోనే లబ్దిదారులు కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి నిజా నిజాలు నిగ్గు తేలుస్తామన్నారు. రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా 14 మాసాల కూటమి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.140 కోట్లు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేసామన్నారు. మరో రూ.106 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనల సిద్ధం చేశామన్నారు. మరో రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని, పనులు వివిధ దశలలో ఉన్నా యన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ద్రాక్షారామం, కోటిపల్లిలో సుమారు రూ.4 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో భర్తలను కోల్పోయి దీనస్థితిలో ఉన్న 130 మంది వితంతు మహిళలకు ఉపాధి కల్పన దిశగా కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములై సహకరించా లని కోరారు. కక్ష సాధింపులకు తావు లేకుండా, పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమం ప్రజలకు అందిస్తున్నా మన్నారు. అలాగే రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో సిఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇప్పటికే అత్యాధునిక అంబులెన్స్, త్రాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశామ న్నారు. అభివృద్ధి, సంక్షేమ విషయంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి దక్కేలా చూస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా, అలాగే ప్రోటోకాల్ పాటించేలా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశిం చారు.ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలపై ప్రజల్లో, వ్యాపారుల్లో అవగాహన కలిగేలా ప్రభుత్వం సూపర్ జీఎస్టీ –సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం నిర్వహిస్తు ఎదన్నారు. అక్టోబర్ 19 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, రాష్ట్రంలో 60 వేల సమావేశాలు నిర్వహించి, సుమారు 1.60 కోట్ల కుటుంబాలను కలవాలని ప్రభు త్వం నిర్ణయించిందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ ం మాదిరిగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ జివిస్టి పొన్నం సత్యనారా యణ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను సమావే శంలో వివరించారు. చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ రాజు, డిఇ శ్రీకాంత్, ఇతర అధికారులు, వార్డు కౌన్సిలర్లు పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతు న్నాయి అంటూ పలువురు వైసీపీ కౌన్సిలర్లు సభలో పేర్కొనడం గమనార్హం.

## పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

మొదటిపేజి తరువాయి

ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈఅర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు,పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు,భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం,తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్‌లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం –365 అర్జీలు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో అందిన దరఖాస్తులు, అర్జీలను సంబంధిత క్షుణ్ణంగా పరిశీలి ంచి, నాణ్యమైన పరిష్కారం అందివ్వాలని ఆయన తెలిపారు. ఆయా శాఖల్లో నమోదైన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్‌కి పంపించడం జరుగుతు ందని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఎపి.జివోవి.ఇన్. వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ రంగంపై కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష





**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు, డీఆర్‌డీఏ, డ్వామా, ఉద్యాన, ఏపీ ఎంఐపీ, పశు సంవర్ధక, మార్కెటింగ్ అధికారులు, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్‌లతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆశావహ దృక్పథం, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి, ప్రతి అధికారి ఒక్కో గ్రామాన్ని పర్యవేక్షిస్తూ ప్రారంభ దశలో 6 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం గ్రామంలోని రైతులందరూ ఆచరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను ఎంపిక చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వినియోగించే కాషాయాలు / ద్రావణాలపై శిక్షణ ఇచ్చి, వారి ద్వారా రైతులకు సేంద్రియ/సహజ వనరులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తద్వారా ఇరువురికి ఏక కాలంలో ప్రయోజనం చేకూరుతుందని, మహిళలు ఆర్థిక సాధికారతతో అడుగులు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అడుగులు వేయాలని, అందులో భాగంగా త్వరితగతిన గ్రామాల ఎంపిక చేసి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు, ఏపీ ఎంఐపీ పీడీ ఏ. దుర్గేష్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ బి. తాతా రావు, జిల్లా ఉద్యాన అధికారి ఎన్. మల్లిఖార్జున రావు, జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, డ్వామా పీడీ ఏ. నాగ మహేశ్వర రావు, మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం. సునీల్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దనాపల్లిలో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ పౌష్టికాహార మాసోత్సవాలు

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని కూటమిపార్టీ శ్రేణులు అన్నారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి సూచనలతో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారము పై అవగాహన కార్యక్రమం చేపట్టారు.

వైద్య శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు పలు రకాల ఉచిత వైద్య పరీక్షలు అందించారు. ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమము ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలుకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మొదలగు వ్యాధులకు డాక్టర్స్ బి రాంబాబు నాయక్, పి కృష్ణ ప్రసాద్ నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. అవసరమగు మందులను రోగులకు అందించారు. ఐసీడీఎస్ అధికారులు ఆధ్వర్యంలో పౌష్టికాహార మసోత్సవాలలో భాగంగా ప్రీస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు పోటీలలో గెలుపొందిన వారికి స్థానిక నేతలు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో



పంచాయతీ కార్యదర్శి, నాయకులు సుంకర సత్యనారాయణ గారు పంచాయతీ పాలకవర్గ సభ్యులు.వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్ కే దైవ కృప, హెల్త్ అసిస్టెంట్లు, ఎం ఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ సూపర్వైజర్ చక్రవేణి,అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో కృష్ణ నాయక్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో గల ఆల్కాట్ గార్డెన్ మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వరద సహాయక పునరావాస కేంద్రాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. మెడికల్ క్యాంప్, భోజన, ఇతర వసతులను పరిశీలించడం జరిగింది.ప్రస్తుతం ఈ పునరావాస కేంద్రంలో బ్రిడ్జి లంక నుండి 123 మంది, కేతావారి లంక నుండి 75 మంది, వెదురమ్మలంక నుండి 76 మంది – మొత్తం 98 కుటుంబాల 274 మంది నివాసం పొందుతున్నారనీ ఆర్డీవో కృష్ణ నాయక్ తెలిపారు. ఆర్డీవో పునరావాసం పొందుతున్న కుటుంబాలతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. భోజన మరియు వైద్య సదుపాయాలు సరైన సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద సంబంధిత అధికారుల సూచనలు పూర్తిగా పాటించాలని, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు.

## వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

- అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలి
- వైస్‌ఛైర్మన్ నెక్కంటి



**పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్ :** మున్సిపల్ అధికారులు ఎటువంటి ఒత్తిడులకు గురి కాకుండా పురపాలక సంఘ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ సూచించారు. సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో పక్షపాతం వహించకుండా విధులు నిర్వహించాలని అలాగే త్రాగునీరు, వీధిలైట్లు, పారిశుద్యంపై దృష్టి పెట్టాలని, తెలిపారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని పలు అంశాలు, అభివృద్ధిపై చర్చించడం జరిగింది. దీనితో పాటు పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డులలో సమస్యలపై సమావేశంలో లేవనెత్తారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ గోకేడ అప్పారావు తన వార్డులో సమస్యలను లేవనెత్తారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ పలు అంశాలపై మాట్లాడుతూ కమీషనర్‌కు, వైస్‌ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతి రాణి, ఆర్వో అచ్యుతరావు, ఏఇలు సుధాకర్, ఉమామహేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఐ గంగాధర్, సుభాషిణి, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనంతో సేవలందించండి

- అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్
- పీజీఆర్ఎస్ ద్వారా 9 అర్జీలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 9 వినతులు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 4, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 2, వార్డు సచివాలయాలకు సంబంధించి రెండు ఉన్నాయి. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నాణ్యతతో వేగంగా పరిష్కరించాలని ఈ సందర్భంగా అదనపు కమిషనర్ అధికారులకు సూచించారు. సమస్యలను వేగంగా పరిష్కరించినపుడే ప్రభుత్వ అధికారులపై ప్రజలకు విశ్వాసం కలుగుతుందన్నారు. కనుక అర్జీదారుల ప్రతి ఒక్క సమస్యను ఓర్పుతో విని జవాబుదారీతనంతో సేవలందించాలన్నారు. అలాగే ప్రజా సమస్యల ఆడిట్ నిర్వహణ సరిగా జరగాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే సంప్రదించండి. సెల్ : 9032209779

# వరదలపై శాఖలందరూ సమన్వయంతో చర్యలు చేపట్టాలి

- ఘాట్ల వద్ద బ్యారికెంటింగ్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వ్యవస్థ
- అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు
- జేసీ మేఘ స్వరూప్



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్** : ధవళేశ్వరం ప్రాంతంలో వరదల దృష్ట్యా ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం అత్యంత ప్రాధాన్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. రెవెన్యూ శాఖ బాధితులను సురక్షిత ప్రదేశాలకు తరలించి సహాయ శిబిరాలు ఏర్పాటు చేయాలనీ, పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, గస్తీ పెంపు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ ఆనకట్టలు పర్యవేక్షించి నీటి మట్టం వివరాలు అందిం చాలన్నారు. పోలీసు రెవెన్యూ, ఆర్ ఎమ్ సి అధికారులతో ఘాట్ల వద్ద బ్యారికెంటింగ్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వ్యవస్థ సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు చెత్త తొలగింపు, తాగునీటి క్లోరినేషన్ చేపట్టాలనీ స్పష్టం చేశారు. ఫైర్ సర్వీసెస్ రెస్క్యూ పరికరాలు సిద్ధంగా ఉంచి అత్యవసర కాల్స్‌కి వెంటనే స్పందించాలన్నారు. ఫిషరీస్ శాఖ జాలర్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి పడవల భద్రతను నిశితంగా గమనించాలన్నారు.

ఎటువంటి అనుమతులు లేకుండా నది లోకి వెళ్ళే వారి విషయంపై దృష్టి సారించాలి అని కోరారు. విద్యా శాఖ పాఠశాలలను శిబిరాలుగా వినియోగించి విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలి. వైద్య శాఖ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి దోమల నివారణ చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖ ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేయాలి, రవాణా శాఖ రహదారులు, వంతెనలను పర్యవేక్షించాలి. పౌర సరఫరాలు, సంక్షేమ, వ్యవసాయ, పరిశ్రమలు తదితర శాఖలు తమ పరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ క్రమంలో ఆలస్యం చేయరాదు, నిర్లక్ష్యం చేయరాదు, ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొనేలా వదిలేయరాదనీ జేసి స్పష్టం చేశారు. ముఖ్యంగా వరద హెచ్చరికలు ఆలస్యం చేయకుండా అందించాలి, శానిటేషన్ లోపాలు వదిలేయరాదు, తడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇవ్వరాదు, ధ్వంసమైన రోడ్లపై వాహన రాకపోకలు అనుమతించరాదు, కలుషిత నీరు అందించరాదు, సహాయ సామగ్రి పంపిణీలో అసమానతలు ఉండరాదు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే బాధితులకు సమయానికి సాయం చేరుతుందని జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ స్పష్టం చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన నంబర్లు: కలెక్టరేట్ కంట్రోల్ రూమ్, బొమ్మూరు - 89779 35611, ఆర్డీవో కార్యాలయం, రాజమహేంద్రవరం - 0883-2442344, ఆర్డీవో కార్యాలయం, కోవ్వూరు - 79953 67797. కామన్ టోల్ ఫ్రీ నంబర్లు: 1070, 112, 1800-425-0101, 8333905022. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు బాగుండాలి.. రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలి

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- శరన్నవరాత్రుల సందర్భంగా కోటసత్తెమ్మ, గుబ్బాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కందుల దుర్గేష్
- అమ్మవార్లకు సారె సమర్పించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, మేజర్ న్యూస్ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన శ్రీ కోటసత్తెమ్మ వారిని, గోపవరంలో కొలువైన శ్రీశ్రీశ్రీ గుబ్బాలమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛరణలు, మేళ తాళాల మధ్య ఆలయ అధికారులు మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు బాగుండాలని, రాష్ట్రం ప్రగతి పథంలోకి దూసుకెళ్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.



అనంతరం మంత్రి దుర్గేష్ దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో పాల్గొని తిలకించారు.

# వ్యక్తిపై దాడి ఘటనలో ఇద్దరు అరెస్ట్...

- ఈనెల 22న పిఠాపురం శ్రీపాద వల్లభ ఆలయం వద్ద వ్యక్తిపై దాడి
- సీసీ ఫుటేజ్‌లతో బయటపడ్డ ఘటన



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఈనెల 22వ తేదీన పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ ఆలయం వద్ద ఒక వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు కలిసి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈనెల 22 సెప్టెంబర్ 2025 తేదీన ఉదయం శ్రీపాద శ్రీ వల్లభ గుడి ముందు ఆటో స్టాండ్ లోని ఆటో డ్రైవర్లు సభ్యత్వం విషయంలో గొడవల పడి దవులూరి గంగరాజు అనే వ్యక్తిని అదే ఆటో యూనియం లోని సభ్యులైన దవులూరి లచ్చబాబు మరియు దవులూరి రాంబాబు అన్నదమ్ములు ఇద్దరు మరియు వారి కుమారుడు ముగ్గురు కలిసి దవులూరి గంగరాజును కొట్టిన నేరంపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 182/25 యు/సె 118(1),115(2),351(3) ఆర్/డబ్ల్యు (5) బి ఎన్ ఎస్‌గా కేసు నమోదు చేయడమైనదన్నారు. సదరు కేసులో ముద్దాయిలైన దవులూరి లచ్చబాబు మరియు రాంబాబు లను అరెస్టు చేసి వారిని రిమాండ్ రిపోర్ట్ తో పాటు పిఠాపురం జేఎఫ్ సి ఎమ్ కోర్టు నందు హాజరుపరచుచున్నామని, వీరు ఇరువురి పై గతంలో కూడా పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయి ఉన్నాయన్నారు. సదరు సంఘటనపై సోషల్ మీడియాలో శ్రీ పాద శ్రీ వల్లభ గుడి ముందు కత్తులతో దాడి అని వార్తలు ప్రసారం అవుతున్నది అది వాస్తవం కాదన్నారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన మూడో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు.

**- ఆలయం ఎదుట తరచూ వివాదాలు...**

దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన శ్రీపాద శ్రీ వల్లభ ఆలయం ఎదుట తరచూ వివాదాలు జరగడం పరిపాటిగా మారింది. కొద్దిరోజుల క్రితం ఒక ఆటో డ్రైవర్ తన కుటుంబంతో సహా ఆలయం ఎదుట ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం సంచలనం కలిగించింది. ఆ ఘటన మరువకముందే... విచక్షణారహిత దాడి ఘటనతో ఆలయం మరోసారి వార్తల్లో నిలవడం ఆవేదన కలిగించే అంశం. తరచూ వివాదాల కారణం అవుతున్న ఆటో యూనియన్ అక్కడి నుంచి తరలించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ దేవస్థానం నందు ఛండీహోమం

- పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణ ంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా దేవి శరన్నవరాత్రులు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సోమవారం ఎనిమిదవ రోజు శ్రీ అమ్మవారు శ్రీశ్రీ సరస్వతి దేవిగా దర్శనమించ్చారు. అమ్మవార్కి బంగారు వెండి పుష్పార్చన,పంచామృతాభిషేకం, పార్థివేశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు, భవానీలకు దర్శనం ఏర్పాట్లు చేయడం జరిగింది. దీనిలో భాగంగా వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఛండీహోమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, జనసేన పట్టణాధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో సరస్వతి దేవి పూజా కార్యక్రమంలో వందలాది సంఖ్యలో భక్తులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొని సరస్వతిదేవి పూజలు నిర్వహించారు. దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు సరస్వతి మొక్కలు, పలకలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది ఎస్.వెంకట రమణ, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ, పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆర్డీఓ, తహశీల్దార్లు



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దసరా నవరాత్రులలో భాగంగా సోమ వారం పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, తహశీల్దార్ సిహెచ్. వెంకట లక్ష్మిలు శ్రీ శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో వేదపండితులు స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, వరహాలు, లోవ, శివ తదితరులు ఉన్నారు.

## మందేశ్వర ఆలయంలో అక్షరాభ్యాసాలు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండలం మందపల్లి గ్రామంలో వేంచేసిన శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఉచిత సామూహిక సరస్వతీ పూజ,అక్షరాభ్యాసం,కుంకుమ పూజలను ఆలయ ఈ.ఓ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇంఛార్జి బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.విద్యార్థులు,చిన్నారులు పాల్గొని సామూహికంగా సరస్వతి పూజలు,మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# మహిళలకు చేయూతని అందిస్తే కుటుంబం బలపడుతుంది

- శిక్షణ పొందే మహిళలకు లయన్స్ క్లబ్ ద్వారా కత్తెరలు పంపిణీ చేసిన వంక రవీంద్రనాథ్
- 9 అంగన్వాడి కేంద్రాలకు కుర్చీలు బహుకరణ
- దాతలను అభినందించిన రవీంద్రనాథ్




**పెరవలి, మేజర్ న్యూస్ :** మహిళలకు చేయూతని అందిస్తే కుటుంబం మొత్తం బలపడుతుంది అనే పెరవలి మండలం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం పెరవలి మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు దేవరపు వెంకటరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంక రవీంద్రనాథ్ చేతుల మీదగా శిక్షణ పొందిన మహిళలకు కత్తెరలు, అంగన్వాడి కేంద్రాలకు కుర్చీలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ 17 సంవత్సరాల క్రితం తాను పెరవలి మండలం వ్యాప్తంగా ప్రజలకు సేవలు అందించాలని ఉద్దేశంతో పెరవలి మండలం లయన్స్ క్లబ్ స్థాపించానని ఆ క్లబ్ ద్వారా చక్కటి సేవలు అందిస్తున్న క్లబ్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన శిక్షణ పొందుతున్న 133 మంది మహిళలకు కత్తెర్లు పంపిణీ చేశారు. ఈ కత్తెరలకు ఆర్థిక సహాయం చేసిన శ్రీ స్పార్క్ సోలార్ కంపెనీ యజమానులు దేవరపు జయరాణి, యాతం రామకృష్ణ లను ఆయన అభినందించారు. తదుపరి 9 అంగన్వాడీ సెంటర్ల కు సెంటర్ కు రెండు కుర్చీలు చొప్పున 18 కుర్చీలను అందించారు. ఈ కుర్చీలకు ఆర్థిక సహాయం చేసిన జోన్ చైర్పర్సన్ మాదిరెడ్డి కృష్ణకుమారి, రీజనల్ చైర్ పర్సన్ అల్లూరి గౌరీరావు లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్సి మాదిరెడ్డి కృష్ణకుమారి, ఆర్సి అల్లూరి గౌరీరావు, పెరవలి ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్, ఎంపీడీవో కేయూఆర్ఎల్ పద్మజ, ఎమ్మార్వో కే నిరంజన్, లయన్స్ క్లబ్ సెక్రటరీ సలాది ఉదయభాస్కరరావు, ట్రెజరర్ బూరుగుపల్లి రాజు, క్లబ్ నెంబర్లు కోటిపల్లి మురళీకృష్ణ, దేవరపు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలంది ంచాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు.కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి పనులపై ఎమ్మెల్యే బండారు ఆసుపత్రి కమిటీ సభ్యులు,డాక్టర్లు మరియు సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.విష ప్రాణుల నుండి రక్షించేందుకు మందులు అందుబాటులో ఉన్నాయని,గుండెపోటుకు సంబంధించి రూ 50 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్లు అందుబాటులోకి తీసుకొచ్చామని అవి ఉచితంగా అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.గత ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రిని నిర్లక్ష్యం చేయడం కారణంగా డాక్టర్లు లేకపోవడం రోగుల సంఖ్య తగ్గిపోవడంతో ఏరియా ఆసుపత్రిగా ఉన్న కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి సి హెచ్ సి ఆసుపత్రిగా మార్చారని దానిని తిరిగి ఏరియా ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.ఆసుపత్రిలో డాక్టర్ల కొరత ఉందని త్వరలోనే పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.గత ప్రభుత్వంలో నిలిచిపోయిన డయాలసిస్ సెంటర్ ను పూర్తిచేసి అందుకు అవసరమైన సామాగ్రికి నిధులు మంజూరు చేయించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# సామాజిక ఆరోగ్య కేంద్రానికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఫ్యాన్లు అందజేసిన జ్యోతుల నవీన్

- ఆసుపత్రిలో పేషెంట్లకు అందించే భోజనాన్ని పరిశీలించిన జ్యోతుల నవీన్



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** జెడ్ రాగంపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఫ్యాన్లు జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో ఉండే పేషెంట్లకు అందించే భోజనాన్ని పరిశీలించి పేషంట్ల సహాయకులను ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్న నవీన్. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మన ప్రాంతంలో సామాజిక అవసరాలను గుర్తించి వాటిని అందించేకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగా ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్యాన్లు అందించడం జరిగిందని అదేవిధంగా తొందరలోనే ఆసుపత్రికి వచ్చే పేషెంట్ల సహాయకుల కు ఉచిత భోజనం అందించే ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, ఆసుపత్రి వైద్యులు ప్రణీత్, పీలా మహేష్, బో దిరెడ్ల సుబ్బారావు, రాయి సాయి, తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు 29 అర్జీలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం స్థానిక పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంత మాధవి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 29 అర్జీలు అందాయని ఇందులో రెవెన్యూ2, మున్సిపాలిటీ14, పిఆర్3, డీఆర్డీఏ3, పోలీస్2, ఇతరములు4, ఆఫ్లైన్ అప్లికేషన్స్1 వచ్చాయన్నారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీ దార్లు వారి యొక్క అర్జీల నమోదు వాటి స్థితికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దొడ్డిగుంటలో భవానీల పడిపూజ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** దేవీ నవరాత్రులు పురస్కరించుకుని భవాని భక్తులు అమ్మవారి మాలలు ధరించి, అమ్మవారి దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరించి విజయదశమి రోజున అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అయితే రంగంపేట మండలం, దొడ్డిగుంట గ్రామంలో అడబాల రామదాసు శ్రీమతి అఖిల దంపతులచే భవానీల పడిపూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయం అల్పాహారం తో పాటు మధ్యాహ్నం భవానీలకు భిక్ష ఏర్పాటు చేసి, సాయంత్రం మూడు గంటల నుండి భవానీలు పేడతుళ్ళు ఆడి, రాత్రి 7 గంటల నుండి దుర్గాదేవికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాదేవి పడి పూజలో హారతి కర్పూరం వెలిగిస్తూ భవానీలు నృత్యాలు చేస్తూ దుర్గాదేవి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు వందల భవానీలకు పైగా పాల్గొన్నారు.

# పదివేల మందికి అన్నదానం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** దేవీ నవరాత్రులను పురస్కరించుకుని జగ్గంపేట మండలం, రాజపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా దేవి అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ గ్రామంలో గత 40 సంవత్సరాల నుండి అమ్మవారి దేవాలయం దిన దినాభివృద్ధి చెందుతూ, భక్తులకు అమ్మవారు దర్శనమిస్తూ, భక్తుల కోర్కెలు తీర్చే దేవతగా వెదజల్లుతున్న దుర్గమ్మ అమ్మవారి దేవీ నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుచున్నాయి. సోమవారం సరస్వతి పూజ జరిగిన అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం జరిగింది. ఈ అన్నదానంలో సుమారు పదివేల మందికి పైగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాండ్రంగ అచ్చారావు, కిలాని అప్పారావు, నంగన నాని (ఎంపీటీసీ), గుమ్మిడి బాలరాజు, చల్లా వెంకన్న, దమ్ము శ్రీను,తాండ్రంగ ఈశ్వరరావు, ఆకుల నాగు, చందక రమణ, చల్లా నాగేశ్వరరావు, కర్నాటి వెంకన్న, నేదూరి అబ్బు, రేఖ స్వామి, కోరాడ వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం

- అసిస్టెంట్ కమీషనర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో భక్తులకు దర్శనం ఏర్పాట్లు
- భజన కళాకారులకు సన్మానం



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా దేవి శరన్నవరాత్రులు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సోమవారం ఎనిమిదవ రోజు శ్రీ అమ్మవారు శ్రీశ్రీ సరస్వతి దేవిగా దర్శనమించ్చారు. అమ్మవార్కి బంగారు వెండి పుష్పార్చన, పంచామృతాభిషేకం, పార్థివేశ్వం ానికి అభిషేకం నిర్వహించారు. అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో భక్తులకు, భవానీలకు దర్శనం ఏర్పాట్లు చేయడం జరిగింది. దీనిలో భాగంగా ఎనిమిదవ రోజు పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన శ్రీ విఘ్నేశ్వర కాళికృష్ణ కనకదుర్గ మహిళా భజన సమాజం, జాజిమొగ్గల గొల్లయ్య బృందం, శ్రీ విఘేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ జాజిమొగ్గల గొల్లయ్య బృందాన్ని శాలువతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది ఎస్.వెంకటరమణ, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ, శ్రీ విఘేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు, వ్యవస్థాపకులు ఎలిశెట్టి కామరాజు, గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి, దువ్వా అచ్చారావు, కోశాధికారి పంచాది రామకృష్ణ, డైరెక్టర్ కొత్త శ్రీనివాస్, మజ్జి వీరబాబు, సత్తిబాబు, సత్యనారాయణ, మహిళా భజన సమాజం సభ్యులు, భక్తులు, తదితరులు ఉన్నారు. అనంతరం దేవస్థాన ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సమస్యలపై వినతులు



రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖల అధికారులతో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనా అధికారిణి యం.సావిత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈవారం వివిధ సమస్యలపై సుమారు 82 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను పివో ఆదేశించారు. రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ పంచాయతీలో 25 మంది గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు ఇచ్చి, వారికి భూమి సరిహద్దులు చూపించాలని, అదేవిధంగా పెద్దగెద్దాడ చెరువుపాలెం గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్లు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించే నిమ్మల కాలువ డ్యాములకు మరమ్మతులు చేయించాలని, అదేవిధంగా దోకులపాడు గ్రామంలో ఉన్న కరెంటు ట్రాన్స్ ఫార్మర్ నాగంపల్లి వీధికి సుమారు పది కరెంటు స్తంభాలతో మార్చాలని పీసా కమిటీ ఉపాధ్యక్షులు కడబాల ఈశ్వరరావు, అన్నిక కాపారావు, ఉగిరాల బుల్లబ్బాయి, ముర్ల గంగిరెడ్డి, పి. భాస్కర్ రెడ్డి, కె. రవి దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ ఇవ్వంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం ఏర్పాటు చేయాలని రేవుల జానకి రెడ్డి, పల్లాల భూపతి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని బొడ్డగుంట కస్నీరు వాగుపై వంతెన ఏర్పాటు చేయాలని చింతలపూడి పంచాయతీ సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ దరఖాస్తు సమర్పించారు. గత తొమ్మిది నెలల క్రితం ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ షాపులకు 34 మందికి పరీక్ష పెట్టి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసిన వారందరికీ రేషన్ డీలర్ షాపులలో నియమించాలని ఎస్.సింధు, పి.దుర్గా దేవి, కె.మల్లీశ్వరి దరఖాస్తు సమర్పించారు. 2014 వ సంవత్సరం నుండి 2018 సంవత్సరములో మంజూరు చేసిన గృహాల పనులు పూర్తిచేయాలని కోసు లచ్చన్న దొర దరఖాస్తు సమర్పించారు. ఏజెన్సీలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్‌పై పనిచేయుచున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని కారం చంద్రమ్మ, కొమరం రాజమ్మ, పి.రమాదేవి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులచే ఘనంగా సామూహిక సరస్వతీ పూజలు

అనపర్తి, మేజర్‌న్యూస్ : వాడ వాడలా శ్రీదేవి నవరాత్ర మహోత్సవం కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని, పొలమూరు గ్రామంలో దేవి సెంటర్లో కొలువై ఉన్న శ్రీ దేవి ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం నాడు అమ్మవారు సరస్వతి స్వరూపం అయినందున పొలమూరు పరిసర గ్రామ విద్యార్థులచే సుమారు 300 మంది విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజలను ఘనంగా నిర్వహించారు. ఓం శక్తి సత్సంగం, దేవి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు ఎలమంచిలి ఫణి శర్మ సారధ్యంలో సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న విద్యార్థులందరికీ భక్తులు సమకూర్చిన పుస్తకాలు, పలక, బలపాలు మరియు పరీక్ష అట్ట, పెన్సిల్లు తదితర 15 రకాల వస్తువులను సరస్వతీ పూజలో ఉంచి ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా ఓం శక్తి సత్సంగ అధినేతలు, టీవీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆలయ ప్రాంగణంలో సరస్వతి పూజలు చేసుకున్న



విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యర్థించి ఉన్నతమైన స్థితిలో ఉన్నారని, చదువులతో పిల్లలు అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు దగ్గరుండి విద్యార్థులచే పూజా కార్యక్రమం నిర్వర్తించారు. అనంతరం అందరికీ ప్రసాద వితరణ చేశారు.

# క్రీడా అకాడమీల పునఃప్రారంభానికి 'శాప్' చర్యలు




కాకినాడ,మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో వివిధ క్రీడా అకాడమీలను త్వరలో పునర్ ప్రారంభించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చర్యలు చేపట్టిందని సంస్థ బోర్డు మెంబర్, అకాడమీస్ కమిటీ సభ్యులు ఎ.రమణారావు తెలియజేశారు.రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ సభ్యులు ఎ.రమణారావు,పేరం రవీంద్రనాద్,కె.జగదీశ్వరి, పిబివిఎస్ఎన్ రాజు లతో ఏర్పాటైన శాప్ అకాడమీస్ కమిటీ సోమవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి క్రీడా అకాడమీల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వసతులు, అదనంగా కావలసిన సౌకర్యాలను అధ్యయనం చేసింది.ఈసందర్భంగా కమిటీ సభ్యులు డిఎస్ఏ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తమ పర్యటన వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎ.రమణారావు మాట్లాడుతూ కోవిడ్ సంక్షోభం, నిధుల కొరత కారణంగా రాష్ట్రంలో క్రీడా అకాడమీలు 2019లో మూతపడ్డాయని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి అనుసరిస్తున్న విధానాల కనుగుణంగా క్రీడా అకాడమీలను తిరిగి పునరుద్ధరించేందుకు శాప్ చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు, తిరుపతి డిఎస్ఏలలో ఈ అకాడమీలను పునర్ ప్రారంభించేందుకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను, ఇంకా కావలసిన సౌకర్యాలను అధ్యయనం చేసి, ఏయే క్రీడల అకాడమీలను ఎక్కడ ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై తమ కమిటీ శాప్ కు నివేదిక సమర్పించనుందని తెలిపారు. అలాగే వివిధ క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మెరుగైన క్రీడా శిక్షణ కల్పించేందు 100 మంది కోచ్ ల నియామకానికి శాప్ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కొరకు కోరిందన్నారు. నెలరోజుల్లోపు క్రీడా అకాడమీలు పునర్ ప్రారంభించేందుకు శాప్ చర్యలు తీసుకుంటోందని, 14 నుండి 16 రకాల క్రీడల అంశాలు ఈ అకాడమీల పరిధిలో ఉంటాయన్నారు. సుమారు 150 మంది క్రీడాకారులకు శిక్షణ కల్పించేందుకు అనువుగా ఇండోర్, అవుట్ డోర్ క్రీడా వేదికలు, హాస్టళ్ళు, కిచన్లు, డైనింగ్ హాళ్ళ వంటి అవసరమైన అన్ని వసతులు ఈ అకాడమీలలో కల్పించడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో దాదాపు అన్ని క్రీడల శిక్షణకు తగిన వసతులు ఉన్నాయని, డార్మిటరీ నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం, కోచ్ ల నియాయకం వంటి అంశాలను తమ పరిశీలనలో గుర్తించామని, వీటిపై శాప్‌కు అకాడమీస్ కమిటీ నివేదిక సమర్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్ఏ సిబ్బంది వేతనాల కుదింపు, పెండింగ్ బకాయిల చెల్లింపు సమస్యలపై వినతి పత్రం కమిటీకి సమర్పించగా, శాప్ కు తెలియజేస్తామని, అలాగే పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేసి పేద క్రీడాకారులకు శిక్షణావసతులు అందుబాటులోకి తెస్తామని కమిటీ సభ్యులు రవీంద్రనాథ్, జగదీశ్వరి, బుచ్చిరాజు తెలియజేశారు. ఈ సమావేశంలో డిఎస్డిఏ శ్రీనివాసరావు, డిఎస్ఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరదల సమయంలో ఆపద్బాంధవుడు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్

– వరద బాధిత 200 కుటుంబాలకు నిత్యవసరాలు వితరణ




చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండలంలోని కుమ్మూరు పంచాయతీ లోని మామిళ్లగూడెం వరద బాధిత గిరిజన కుటుంబాలకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ఒక్కో కుటుంబానికి కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు, కేజీ కందిపప్పు, 1 లీటర్ మంచి నూనె సోమవారం అందజేశారు. ఇటీవల వరదల కారణంగా కుమ్మూరు పంచాయతీ పరిధిలో మామిళ్లగూడెం ప్రజలు జలదిగ్బంధనంలో ఉండిపోవడంతో గిరిజన కుటుంబాలు అనేక ఇబ్బందులు పడిన నేపథ్యంలో ఈ సహాయం అందజేసినట్లు జమాల్ ఖాన్ తెలిపారు. వరదల సమయంలో అందించేందుకు ప్రయత్నం చేయగా భారీ వర్షంతో వాగులు పొంగడంతో ఆ సమయంలో సహాయం చేయడం సాధ్యపడలేదని వరదలు కొంత మేర తగ్గిన పిదప సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యండి జహంగీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పి.సాల్మన్ రాజు, అనిగి చంద్రయ్య, జానీ పాల్గొన్నారు.

## త్రాగునీరు కలుషితం

– పట్టించుకోని అధికారులు



యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ : గత నెల రోజులుగా త్రాగునీరు కలుషితం అవుతున్నా ఇటు సిబ్బంది గాని, అటు ఆర్డబ్ల్యూఎస్ సంబంధించిన అధికారులు కానీ పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వాకతిప్పలో ఉన్న నాగులపల్లి ఏరియా మరియు పరిసర గ్రామాల రక్షిత మంచినీటి పథకం నుండి ఉప్పాడ వెళ్లే ప్రధాన పైపులైను వాకతిప్ప గ్రామ సత్తెమ్మ తల్లి గుడి ఎదురుగా గత నెల రోజులుగా త్రాగునీరు లీకు అవుతూ కలుషితమవుతోంది. అయినప్పటికీ సిబ్బందిగానీ సంబంధిత అధికారులు కానీ మరమ్మత్తులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రోజురోజుకి వాతావరణం మార్పులు కారణంగా త్రాగునీరు కలుషితమైతే రోగాలు వస్తాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మరమ్మత్తులకు గురైన వాల్వు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ వాసవి అమ్మవారికి వెండి మకర తోరణం సమర్పణ



పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం పట్టణంలోని స్థానిక కోటగుమ్మం సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి . . . పట్టణానికి చెందిన చక్కా ఇందు శ్రీ వెండి మకర తోరణాన్ని సమర్పించారు. సుమారు రూ. 1 లక్ష అరవై వేల విలువగల వెండి మకర తోరణాన్ని ఆమె తల్లిదండ్రులు చక్కా సురేష్ గుప్తా, లక్ష్మీ ప్రసన్న సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ తండ్రిగారైన చక్కా సుబ్రహ్మణ్యేశ్వర శ్రేష్ఠ ఆశీస్సులతో అమెరికాలో మంచి ఉద్యోగంలో స్థిరపడి వచ్చిన మొదటి సంపాదనలో కొంత భాగాన్ని తమ కుమార్తె అమ్మవారికి సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దంగేటి సత్యనారాయణ మూర్తి, ఆర్య వైశ్య సంఘం కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు వెలగ వెంకట నగేష్, చక్కా కుటుంబం సభ్యులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# కోరమండల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఆధ్వర్యంలో మహా అన్న సంతర్పణ

- ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన కాంట్రాక్టర్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ సలాది శ్రీనివాస్ బాబు
- గత పది సంవత్సరాలుగా వనదుర్గ అమ్మవారికి ఘనంగా దేవీ నవరాత్రులు
- సుమారు పదివేల మందికి మహా అన్నదానం



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** గత పది సంవత్సరాలుగా ఎంతో ఘనమైన వన దుర్గ కనకదుర్గమ్మ వారికి ప్రతి ఏటా దేవీ నవరాత్రులు నిర్వహించి సుమారు పదివేల మందికి అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు కాంట్రాక్ట్ వర్కర్స్ అధ్యక్షుడు పాతాళ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వలస పాకల కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ వద్ద వెలసి ఉన్న శ్రీ వన కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కోరమండల్ ఫ్యాక్టరీ యాజమాన్యం మరియు కాంట్రాక్ట్ వర్కర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దేవీ నవరాత్రులు సందర్భంగా మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫ్యాక్టరీ యాజమాన్యం కాంట్రాక్టర్ రెడ్డిపల్లి శ్రీనివాస్ వర్కర్స్ యూనియన్ లీగల్ అడ్వైజర్ జనసేన లీడర్ సలాది శ్రీనివాసు బాబు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం అన్న సంతర్పణలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ నాయకుడు పాతాళ శ్రీనివాస్ మాట్లాడుతూ మాకు ఏ కష్టం వచ్చినా మా కాంట్రాక్టర్ రెడ్డిపల్లి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ సలాది శ్రీనివాస్ బాబు వర్కర్స్‌కు వెన్ను దన్నుగా ఉంటారని అలాగే కోరమండల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఉద్యోగులు సహకారం మరువలేనిది అని అన్నారు. కాంట్రాక్టర్ రెడ్డిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. సలాది శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అతిపెద్ద ఎరువుల కర్మాగారం మురుగప్ప గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కోరమండల్ ఫ్యాక్టరీ ఒకటి అని, రైతులకు నాణ్యమైన ఇరువుల తయారుచేసి అధిక దిగుబడి సాధించే విధంగా ఎరువులు తయారు చేస్తారని, అంత ఘనమైన చరిత్ర ఈ కంపెనీకి ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ కార్యవర్గం మరియు కార్మిక నాయకుడు మాధవరపు వీరభద్రరావు, వర్కర్స్ పాల్గొన్నారు.

# వెంకన్న దివ్యదర్శనం భక్త పావనం

- వెంకన్నకు బంగారాన్ని విరాళంగా ఇచ్చిన జబర్దస్త్ వర్ష
- నిత్య అన్నదాన పథకానికి విరాళాలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి దివ్య క్షేత్రానికి సోమవారం భక్తజనం పోటెత్తారు. దీంతో పరిసరాలన్నీ గోవింద నామ స్మరణతో మిన్నంటాయి. సందర్భంగా ఐశ్వర్య లక్ష్మి హెూమం, గోపూజ, అష్టోత్తర శతమావళి, బాల భోగం, కళ్యాణం తదితర కార్యక్రమాల అర్చకులు రమణీయంగా జరిపించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. జబర్దస్త్ వర్ష స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం 4 గ్రాముల రూ.49 వేల విలువైన ఈ బంగారాన్ని స్వామివారికి ఆమె భక్తితో సమర్పించారు. అలాగే దేవస్థానంలో పనిచేస్తున్న సరిదే భాను అనే ఉద్యోగి రూ.50.116 లు; కడియపులంకకు చెందిన తిరుమలశెట్టి సత్తిబాబు, లక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు రూ.50,116లు విరాళంగా సమర్పించారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## బిల్డింగ్‌పై నుంచి పడి పెయింటర్ మృతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** బిల్డింగుకు పెయింట్లు వేస్తూ జారీ పడడంతో పెయింటర్ అరవ అరుణ్ కుమార్(37)మృతి చెందాడు. సామర్లకోట పెన్షన్ లైన్ కు చెందిన అరవ అరుణ్ కుమార్ సోమవారం జయలక్ష్మి థియేటర్ వద్ద రెండంతస్తుల బిల్డింగు కు పెయింట్లు వేస్తుండగా తాడు జారడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగాలు ఆదివాసి యువతకే ఇవ్వాలి

- రద్దయిన జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- ఎంపీపీ గోము వెంకటలక్ష్మి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి గిరిజన ప్రాంతాల్లో నూటికి నూరు శాతం ఉద్యోగాలు ఆదివాసీ యువతకే ఇవ్వాలని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం రంప చోడవరం యూటీఎఫ్ బిల్డింగ్ లో జరిగిన ఆదివాసీ అఖిల పక్ష ఐక్య సమావేశ నీ ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమయంలో 2019 సుప్రీంకోర్టు జి వో నెంబర్3 ని రద్దు చేయగా అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప శ్రీ వాణి జి వో నంబర్ 3 రద్దు ను సవాల్ చేస్తు అప్పీలు చేశారు. అనంతరం కోవిడ్ పరిణామాల దృశ్య వాటి విషయం లో కోర్టు లో జాప్యం జరిగిదని అయిన కానీ జగన్ ముఖ్యమంత్రిగా మన గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు అన్యాయం జరగకుండా మన్యం, అల్లూరి,గిరిజన జిల్లాలు ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల్లో సచివాలయం సిబ్బంది నియామకం 100శాతం గిరిజనులతోనే నింపి ఆఖరికి తాత్కాలిక ఉద్యోగాలు అయినా వాలంటర్స్ నీ కూడా గిరిజనులకే ఇచ్చారని,గత ప్రభుత్వంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం లను పర్మినెంట్ చేసి 23సలో కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ అలాగే డి ఎస్ సికి 6000 పోస్టులు కి నోటిఫికేషన్ ఇచ్చారని. అయినా గిరిజన ప్రాంతాల్లో రద్దు అయిన జి వో నంబర్ 3 కి ప్రత్యామ్నాయజి వో తెచ్చి 100 /పోస్టులు గిరిజన యువతకు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ముఖ్య మంత్రి మాటతప్పారని, ఈ మేరకు అన్ని పోస్టులు, బ్యాక్ లాగ్ ఉద్యోగాలు గిరిజనులు తో నింపాలని, వీటిని చర్చించేందుకు తక్షణమే ఐటిడిఎ పాలకమండలి సమావేశం నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆదివాసీజేఏసీ నాయకులు, డిఎస్‌సి యువత వంతు బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశంలో బారీగా ఆదివాసీ యువత, మహిళలతో పాటు రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, బరదనంపల్లి ఎంపీటీసీ సుంద్రు లోవ లక్ష్మీ, రాజవొమ్మంగి ఎంపీటీసీ కనిగిరి గంగదుర్గ వీరబాబు, సర్పంచులు గణలక్ష్మి, జగన్నాథం, సూరిబాబు, వాతంగి వైస్ సర్పంచ్ అర్జున్, వజ్రపు అప్పారావు మిగతా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కనకదుర్గ అమ్మవారి ఆలయానికి జమాల్ ఖాన్ 2 క్వింటాళ్ల బియ్యం వితరణ




**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల కాలనీలో దసరా మహెూత్సవాల సందర్భంగా కనకదుర్గ అమ్మవారి ఆలయానికి ఆయుర్వేద వైద్యులు జెకెసిట్రస్ట్ చైర్మన్, తెలుగుదేశం నాయకులు మొహమ్మద్ జమాల్ ఖాన్ రెండు క్వింటాళ్ల బియ్యాన్ని నవరాత్రి ఉత్సవ కమిటీకి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు, సర్వ సృష్టికర్త సర్వేశ్వరుడు అనేక రూపాల్లో విభిన్న కుల మతాలలో ఉన్నారని ఆయన అన్నారు. మానవాళికి, యావత్ ప్రపంచానికి, సకల చరాచర జీవరాసులన్నిటికీ ఏకేశ్వరుడు మనుషుల మనసులో నిండి ఉన్నాడని ఆయన తెలిపారు. అందరూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి, సహృద్భావంతో ఉండాలని, అన్ని దానాల కంటే మిన్న అన్నదానమేనని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల గ్రామ పెద్దలు పేరాల వెంకటేశ్వర్లు, గనీ శెట్టి సత్యనారాయణ, రాచూరి చంద్రశేఖర్, అవులూరి సత్యనారా యణ, నడిపింటి వెంకన్న, ట్రస్ట్ సభ్యులు జావేద్, షాజహాన్, జహ్వార్ అహ్మద్, భూక్య మోహన్ పాల్గొన్నారు.

## సరదాగా ఈతకు వెళ్లి మృత్యుఒడిలో చేరి



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** సరదాగా ఈతకు వెళ్లి దురదృష్టవశాత్తు మృత్యుఒడిలో చేరిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వానపల్లి గ్రామ శివారు నక్కావారి పేటకు చెందిన నక్కా అఖిల్(19)భీమవరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు నేపథ్యంలో తను ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తన స్నేహితులతో గోదావరి ఏటికాలువలోకి ఈతకు వెళ్లి గల్లంతు అవ్వడంతో మిగతా వారు కేకలు వేయగా చుట్టుపక్కల వాళ్ళు రక్షించి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు జరిపి చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై. సురేంద్ర తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా దసరా ఉత్సవాలు





**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ: శరన్నవరాత్రి పూజా కార్యక్రమంలో ఆదిత్య అధినేతలు శ్రీమతి లక్ష్మీ రాజ్యం శ్రీ శేషారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా 7వ రోజు సందర్భంగా 29 వ తేదీన మూలా నక్షత్రం, అమ్మవారి జన్మ నక్షత్రం సందర్భంగా సరస్వతీ అవతారంలో విశేష పూజలు నిర్వహించిన డా.నల్లమిల్లి శేషారెడ్డి దంపతులు మాట్లాడుతూ రేపటినుండి 30వ తేదీ దుర్గాష్టమి,దుర్గ హెూమం వచ్చేనెల 01 తేదీ మహర్నవమి, విశేష పూజలు..02 వ తేదీ విజయదశమి, విశేష అభిషేకాలు,అర్చనలు నిర్వహించబడతాయి అని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మ కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య అధినేతల కుటుంబ సభ్యులతో పాటు ఆదిత్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండాలమ్మకు మొక్కు చెల్లించుకున్న ఆరిమిల్లి కృష్ణ తులసి



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు గ్రామ ఆడపడుచు తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణ తులసి సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం కానూరు కొండాలమ్మ ఆలయానికి వచ్చి 101 కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

# గంజాయి అక్రమ రవాణా





- పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నం
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- గంజాయి ప్యాకెట్లు, ఇన్నోవా కారు సీజ్

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా...గంజాయి అక్రమ రవాణా ముఠా రెచ్చిపోతున్నారు. కొత్త కొత్త పంథాలను అనుసరిస్తూ పోలీసులను మస్కా కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.తాజాగా ఇన్నోవా కారులో గంజాయి అక్రమ రవాణా చేస్తూ,పోలీసులకు దొరికిపోకుండా ఉండేందుకు తమ ఇన్నోవా కారును ప్రభుత్వ వాహనంగా భావించేలా చేసి ప్రయాణిస్తున్న ఒక స్త్రీ, ఇద్దరు పురుషులు...ఒక టోల్ ప్లాజా వద్ద పోలీసులు తమ కారును ఆపబోవటంతో కంగారు పడి ర్యాష్ డ్రైవింగ్ చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, సదరు కారును ట్రాక్ చేసిన పోలీసులు, కారును, అక్రమ రవాణా చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా వున్నాయి...ఈ నెల 23వ తేదీన 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని రాసివున్న ఆర్‌జె 0యు 4616 ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న ఒక స్త్రీ, ఇద్దరు పురుషులు, వెనుక ఒక ఖాకీ యూనిఫారంతో వుండి, విశాఖపట్నం నుండి రాజమండ్రి వైపు గంజాయి అక్రమ రవాణా చేస్తూ, భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జొన్నాడ టోల్ ప్లాజా వద్ద పోలీసులు కారును ఆపగా, డ్రైవర్ వేగంగా డ్రైవ్ చేసి టోల్ ప్లాజా సిబ్బందిని గుద్ది, కాకినాడ వైపు వస్తున్నట్లుగా, సదరు కారుని పట్టుకోవాల్సింది జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. ఈ క్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైఆర్‌కె, కిర్లంపూడి ఇంచార్జ్ ఎస్సై టి.రఘునందనరావు మరియు సిబ్బంది కాకినాడ జిల్లా, కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీల సందర్భంగా కారు డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించి, అక్కడే వున్న లారీని గుద్ది పారిపోవుచుండగా, ముద్దాయిలను, కారును ఆపుటకు, సదరు డ్రైవరును కారు నుండి క్రిందకు దింపడానికి ప్రయత్నం చేయగా, తీవ్రంగా ప్రతిఘటించి కారు నుండి దిగకుండ కారు నడుపుకుంటూ ప్రత్తిపాడు వైపు వేగంగా వెళ్ళిపోయాడు. కిర్లంపూడి గ్రామంలో పైడితల్లి అమ్మ గుడి ప్రక్కన ఉన్న రోడ్‌పై కారు నుండి, రెండు గంజాయి పాకెట్లు పడి ఉండటం గమనించి, రెండు గంజాయి పాకెట్లు మొత్తం 4.390 కేజీలు స్వాధీనపరచుకోవడమైనది.కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు అధ్వర్యంలో, విశాఖట్నం మరియు తూర్పు గోదావరి ఈగల్ టీం వారి సహకారంతో, జగ్గంపేట సిఐ, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, 25వ తేదీన సదరు క్రైమ్ కారు ట్రాక్ చేస్తూ వెల్లుచుండగా, పెద్దాపురం మండలం, ఆర్.బి.కొత్తూరు నుండి చినబ్రహ్మదేవం గ్రామం వెళ్ళే రోడ్‌లో చినబ్రహ్మదేవం గ్రామ పొలిమెరలో, పుంత దారిలో పొల్లాలో కిట్-కిట్ ప్లాస్టిక్ కవర్లో పాకెట్లు ఉన్నట్లు అక్కడికి వెళ్ళి 160 గంజాయి పాకెట్లను మొత్తం సుమారు 350 గంజాయిని సిజ్ చేసి, కిర్లంపూడి పోలిస్ స్టేషన్లో, అదేవిధంగా జొన్నాడ టోల్ ప్లాజా వద్ద జరిగిన ఘటనపై భీమునిపట్నం పోలీసేస్టేషన్‌లోనూ కేసు నమోదు చేయటం జరిగింది. 29వ తేదీన సాంకేతిక పరిజ్ఞానంతో కారును ట్రాక్ చేసి, కిర్లంపూడి మండలం రాజుపాలెం దాటిన తరువాత పుంత రోడ్డు, రావిచెట్టు దగ్గర ఉన్నట్టు గుర్తించి, అక్కడ వున్న కాదం సింగ్ అలియాస్ కుందన్ సింగ్, మాపి కన్వర్, కన్కర్ దేవిలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 11 ప్యాకెట్లు, కారులో రెండు ప్యాకెట్ల గంజాయిని, మొత్తం 383.820 కేజీలు గల రూ.19,19,100లు విలువైన 175 గంజాయి ప్యాకెట్లు; రూ.10 లక్షల విలువైన ఇన్నోవా కారును, రూ.4 వేల విలువైన రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి విశాఖకు వ్యాపార నిమిత్తం వలస వచ్చి, అక్కడే వుంటూ, విశాఖ ఏజెన్సీ ప్రాంతం మరియు ఒడిశా నుండి గంజాయిని సేకరించి రాజస్థాన్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు వివరించారు.

## జిల్లాలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు

- పూర్తిస్థాయిలో నిర్వహించాలన్న జెసి రాహుల్ మీనా




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ 2.0 కింద ప్రజలకు కలిగే లబ్ధిపై అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గ, మండల, వార్డ్ సచివాలయ స్థాయిలో జీఎస్టీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో జిఎస్టీ పై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. అక్టోబర్, 19 వరకు జిల్లాలో "సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్" పేరుతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జీఎస్టీ 2.0 కింద ప్రజలకు కలిగే లబ్ధిపై పూర్తి అవగాహన కార్యక్రమాలు జిల్లాలో 4 వారాల పాటు నిర్వహించాలని జీఎస్టీ అధికారులతో కలిసి మిగిలిన శాఖ అధికారులు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు నిత్యం వినియోగించే నిత్యావసర సరుకులపై ఏ మేరకు జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ది కలుగుతుందోనని ప్రతీ ఇంటింటికి వెళ్లి తెలియజేయాలన్నారు. నాలుగు వారాల పాటు ప్రతీవారం ఒక థీమ్ తీసుకుని ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ సచివాలయ స్థాయిలలోను మరియు ప్రభుత్వ కార్యాలయాలలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు, జీఎస్టీ ఛాంపి యన్స్ గా ప్రభుత్వ సిబ్బందిని నియమించి జీఎస్టీ గతంలో ధరలకు ప్రస్తుత ధరలను సరిపోల్చి ప్రతీ కుటుంబానికి అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ వినియోగించే పాలు దగ్గర నుండి నిత్యావసర వస్తువులు, పుస్తకాలు, స్టేష నరీ, వాహనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పరిశ్రమలలో ఉపయో గించే యంత్రాలు, ఔషదాలు, ఆరోగ్య భీమా ప్రీమియంలు ఏ మేరకు తగ్గాయి అనే విషయాన్నీ ప్రతీ ఒక్కరికీ తెలిసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ గతంలో జిఎస్టి నాలుగు 28, 18, 12, 5 శాతం స్లాబులు ఉండేవని వాటిలో 28, 12 స్లాబులు తీసివేసి 18, 5 స్లాబులు మాత్రమే ప్రస్తుతం అమల్లో ఉన్నా యని, ఇవి ఈనెల 22 వ తేదీ నుండి అమల్లోకి వచ్చాయని, వీటి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని, అట్టి విషయాన్ని వారికి తెలియజేయాలని ఆమె సూచించారు. జీఎస్టీ స్లాబులు తగ్గింపు వల్ల ప్రతి కుటుంబానికి నెలకు సుమారు 1500 రూపాయల వరకు లబ్ధి పొందుతారని ఆమె తెలిపారు. ఏ దుకాణదారుడు అయినా గతంలో ఉన్న జీఎస్టీ రేట్లు, ప్రస్తుతం జీఎస్టీ రేట్లు ప్రకారంగా వస్తువుల ధరలు పట్టికలు ఏర్పాటు చేయకపోయినట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జిఎస్టి కార్యాలయంలో, డివిజన్ కార్యాలయాల్లో, మండల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు తెలియజేయాలని ఆమె సూచించారు. జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలు పొందేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిజిహెచ్ & ఆర్‌ఎంసి ప్రత్యేక పరిపాలన అధికారి శ్రీధర్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, సీపీవో పీ.త్రినాథ్, డీపీవో రవికుమార్, వివిధ శాఖలజిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇరువురికి మంత్రి సుభాష్ రూ.30 వేలు ఆర్థిక సహాయం





**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఇరువురుకి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం చేసి ఆపన్న ఆస్తం అందించారు. రామచంద్రపురం మండలం శీలంవారి సావరం గ్రామానికి చెందిన శ్రీనివాస్ మాణిక్యం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీనివాస్ సమస్యలను స్థానిక కూటమి నాయకుల ద్వారాతెలుసుకున్నమంత్రి తక్షణసాయంగా రూ. 20 వేలు చెక్కు అందించి భరోసా కల్పించారు. అలాగే ద్రాక్షారామం భీమేశ్వరుని ఆలయంలో పనిచేస్తున్న నిరుపేద పురోహితులు కావులూరి సీతారాం అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆయన దీనస్థితిని చూసి చలించిన మంత్రి సుభాష్ గత మూడు నెలలుగా నెలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆ క్రమంలో సోమవారం కూడా ద్రాక్షారామం భీమేశ్వరుని సన్నిధిలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. నిరుపేదలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారిపట్ల సామాజిక సేవా దృక్పథంతో, వారి పట్ల కనికరం చూపిస్తూ ఆర్థిక సహాయం అందించి వారికి ఆసరాగా నిలుస్తున్న మంత్రి సుభాష్ సేవా నిరతి పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రతి వ్యక్తి ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ వ్యక్తిగత శుభ్రత పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని పేరవరం నీటి సంఘం అధ్యక్షుడు జజ్జువరపు హరిబాబు, సర్పంచ్ జజ్జువరపు శ్యామల లు అన్నారు. సోమవారం వద్దిపర్రు గ్రామంలో హెల్త్ వెల్ఫేర్ సెంటర్ నందు ఆత్రేయపురం వైద్య సిబ్బంది సహకారంతో స్వస్థనారి సుశక్తి పరివార్ అభయాన్ ప్రోగ్రాం నిర్వహించి గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ప్రతి స్త్రీ ఆరోగ్యమైన పోషకాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తప్పకుండా వైద్యుల వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తరచూ వైద్య పరీక్షలు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరుణ కుమార్, హెల్త్ సూపర్వైజర్ జె.విజయ్ భాను, ఎంఎల్‌హెచ్ పి.జ్యోతి, ఏఎన్‌ఎం స్నేహలత, ఆశ లక్ష్మి, సుశీల, విజయ మణి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి దేవిగా శ్రీ నూకాలమ్మ అమ్మవారి దర్శనం




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారు భక్తులకు సరస్వతి దేవిగా దర్శనం ఇవ్వడం జరిగింది. దశమి నవరాత్రులలో భాగంగా కార్యనిర్వాహణా ధికారి రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి దేవస్థానం నందు సరస్వతి దేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, భక్తులు సరస్వతిదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, గ్రామ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.